# కాదేదీ కవితకి అర్హం!

## పి.వి.ఆర్.శివకుమార్

"కొంప మునిగిందిరా బాబూ!"

గావుకేక పెట్టుకుంటూ సుడిగాలిలా రూములోకొచ్చి పడ్డాడు కామేశం.

"ఎవరిది?" తాపీగా అడిగాడు రమణి సౌందర్యాన్ని అన్ని కోణాల్నుంచీ తదేకంగా పరిశీలిస్తున్న బాబు.

"ఎవరిదేమిట్రా? నాదే" కంగారుగా అన్నాడు కామేశం, "నేనిప్పు డర్జంటుగా ఓ కవిత రాసెయ్యాలి."

"రాసి పారెయ్. దానికేం?"

"ఏడిశావు లేవోయ్, బోడి సలహా-నువ్వూనూ! అంత తేలిగ్గా రాసిపారెయ్ గలిగితే ఇంత బాధెందుకు?"

"పోనీ-రాయకు."

"ఒరే బాబిగా! నిన్నూ...."

ఇహ నేను కల్పించుకోకపోతే వీళ్ళిద్దరూ కలయబడి శాంతిభద్రతల సమస్య తెచ్చేలా వున్నారనిపించింది.

"ఒరే కామేశం, నువ్విలా రా! బాబూ నువ్వెంచక్కా రమణి సౌందర్యాన్నే ఆస్వాదించు నాయనా!" అంటూ హోంమంత్రిలా వాళ్ళిద్దరిమధ్యా తల దూర్చాను.

కామేశం ఇంక నామీద పడ్డాడు.

"చూడ్రా, వెధవ బుక్కులూ వాడూనూ! నాలో ఒకప్పుడున్న కవితా శక్తిని ఖూనీ చేసి పారేసింది వాడుకాదూ? వెధవ....ఇంతా చేసి ఏమీ యెరగనట్టు రాసుకో, ఫో! అంటున్నాడు."

"కామేశం, నాలిక జాగ్రత్తగా తిప్పు నాయనా! నా కోపం వచ్చేయ్‌గల్దు!" వార్నింగ్ పడేశాడు బాబి.

"ఏడిశావ్, వెధవా! పత్రికలు కొందాంరా అంటే, రమణీ-లలనా అన్నావ్! శ్రీశ్రీని కొందాంరా అంటే మధుని తెచ్చి పడేశావ్! నాలోని కవితాధార చివరంటా ఇంకిపోయేలా చేసిపారేశావ్! హుం!"

"ఇంతకీ యిప్పుడొచ్చిన నష్టమేమిటి కామేశం?" బుజ్జగింపుగా అడ్డు తగిలాను. మళ్ళీ దారికొచ్చాడు వాడు—

"ఇప్పుణ్నే నర్జంటుగా ఓ కవిత రాయాలి—"

"ఆ ముక్క రూములోకొస్తూనే చెప్పావ్-ఇహ కారణం ఏడువ్" విసుక్కున్నాను.

"చెప్తాన్రా! ఇవాళ కాలేజీలో ఓ గొప్ప రహస్యం తెలిసింది. రహస్యం గనుక ఎవరికీ చెప్పనని మాట యిస్తేనే...."

"సరే! నీకు మాట యిచ్చి చెప్పించుకో వలసినంత అవసరం నాకు యేముందీ? చెప్పకు...."

"అబ్బ! అలాగనకురా! సరే చెప్తానుగానీ-ఎవళ్ళతోనూ అనకేం! సంధ్య....కవిత రాసిందిటరా!"

"ఎవరు?....సంధ్యా!....సరే రాస్తే?"

"అబ్బ! మిడిల్లో రాబోకు. మన కాలేజీ మాగజైన్‌కి కవితలిమ్మన్నారు కదా! మొట్టమొదటి కంట్రిబ్యూషన్ సంధ్యదేనుట! విప్లవాత్మకమయిన గేయం ఒహటిచ్చిందిట నిన్ననే!

అయ్యో, నేనింకెలా ఆగన్రా? ఇంకా ఓ గేయం రాయకుండా యెలా బ్రతకన్రా?"


"అబ్బబ్బ....ఆగరా! అసలామె గేయం సెలక్టవుతుందని గ్యారంటీ ఏమిటి? అయినా, ఎవర్చెప్పారు నీకీ సంగతి?"

"రాజుగాడు. అదేరా, మాగజైన్ కమిటీ మెంబర్! నిన్న సాయంత్రం ఎడిటర్స్ ఫైల్లో చూస్తే-వుందిట!

అయినా యింత త్వరగా యెలా రాసిందిరా- నాల్రోజులైనా కాలేదు నోటీసిచ్చి...."

"లేకపోతే గేయాల్రాసేవాళ్ళుకూడా నవలా కారుల్లాగా నెలల తరబడి రాస్తారనుకున్నావా?" బాబిగాడు కామెంట్ విసిరాడు.

"నే బజారుకెళ్తున్నా. కాయితాలూ, ఇంకు బాటిలూ కొని తెచ్చుకోవాలి...." బాబిగాడి కామెంట్ విననట్టే, బయటికి పరిగెడుతూ



అన్నాడు కామేశం.

"ఇంతోటి రచనకి రూములో వున్న ఇంక్ పనికిరాదు కాబోలు" మళ్ళా రమణిలో దూరాడు బాబిగాడు.

కామేశం బయటికి వెళ్ళగానే జరిగిన దృశ్యం ఓసారి నెమరవేసుకుని వులిక్కిపడ్డాను! కొంపదీసి కామేశంగాడు కవితా రచన్ని పునరుద్ధరిస్తున్నాడా!!

* * *

కామేశం చిన్నప్పుడు కవితల్రాశానంటూ రూములో చేరిన కొత్తల్లో తెగ ఉద్ఘాటించేవాడు. అయితే బాబిగాడూ, నేనూ సదరు కవితలు ప్రచురించబడిన పత్రికలు చూపించమంటూ పోరగా—సదరు అవేవీ ప్రచురితం కాలేదన్న సత్యాన్ని అంగీకరించాడు. కానీ, అందుక్కారణం మాత్రం పత్రికా సంపాదకుల అసమర్థతేగానీ, తన కవితల్లోని భావ దారిద్ర్యం కానే కాదని వక్కాణిస్తూ వుండేవాడు.

అప్పుడప్పుడు, ఏ అర్ధరాత్రివేళనో లేచి కూర్చుని ట్యూబులైటు వెలిగించి, రెండు మూడు లైన్లు గిలికేవాడు. ఇహ అక్కడనించీ మొదలెట్టేవాడు—

"రావైతివే ప్రియా—రయముతో
నను చేర
చేరి రంజింపవే—నా హృదయ
సీమలన్!
రావైతివే ప్రియా....ప్రియా...."

అంటూ నెమ్మదిగా ఎత్తుకుని, పైపైకి పోయి, చెవి కోయబడ్డ మేకల స్థాయికి చేరుకునేవాడు.

ఒకరోజు ఓర్చుకున్నాం. రెండోరోజు సహించాం. ఇక మూడోసారి మంచంమీద నుంచి తాడెత్తున లేచాడు బాబిగాడు.

"ఒరే కాముడూ!నీ దిక్కుమాలిన కవిత్వ సాధన వొదిలిపెడతావా? పెట్టే బెడ్డింగ్‌తో

సహా నిన్ను హాస్టలు బయటికి విసిరేయ మంటావా?"

"అది కాదురా! ఈ నిశ్శబ్ద నిశీధిలో నా కవిత్వ సాధన నిరాటంకంగా...."

"అలాగైతే వూరి బయటికి పో! నక్కలు కూడా తోడుంటాయి! ఇలా రూముల్లో కూచుని మా దుంపతెంచావంటే జాగ్రత్త!"

దాంతో, పాపం, కామేశం కవిత్వం ఆగిపోయింది. అప్పట్నించీ బాబిగాడు వాణ్ణి రుద్దటం ప్రారంభించాడు.

"ఈ రోజుల్లో కాలేజీ స్టూడెంట్స్‌కి అమ్మాయిలూ-ప్రేమాయణాలూ ముఖ్యంగానీ, కవిత్వాలూ-కథలు కాదు నాన్నా! అంచేత నా మాట విని, "ప్రేమించడం ఎలా?", "సక్సెస్ ఇన్ కాలేజ్ విదిన్ సింగిల్ టరమ్" లాటి గ్రంధాలు చదువు. థియరీ పూర్తయ్యాక ఏ కోమలాంగినో చూసుకుని ప్రాక్టికల్ ప్రారంభించు. నా గైడెన్స్ ఎప్పుడూ వుంటుంది నీకు!" అంటూ వాడిని బాట మళ్ళించాడు.

అనతి కాలంబుననే సంధ్యారాణి యను చిన్నదానియందు మనంబు కుదిరినవాడై, ఆమె అనుగ్రహంబుకై పడరాని పాట్లు పడుచున్న తరుణంబున....

సంధ్య కవిత రాసినట్లు కబురు తెలిసిందన్నమాట!

ఆంజనేయ దండకం పుస్తకంకోసం నా పుస్తకాల రాక్ అంతా వెతకడం మొదలెట్టాను.

* * *

ఆ రాత్రి మెస్సులో భోజనాలు పూర్తి కాగానే సినిమాల ఇంటర్వెల్ టైమును సైతం లెక్కచెయ్యకుండా నరాస్రూముకొచ్చేశాడు కామేశం. బాబు మాత్రం డ్యూటీమీద సినిమా హాల్స్ దగ్గరకు వెళ్ళిపోయాడు. నేనొక్కడినే రూమ్‌లో వున్నాను.

ఒస్తూనే గబగబ నాలుగైదేళ్ళనాటి పత్రికలు తిరగేశాడు. శ్రీశ్రీ బొమ్మ వోటి వెతికి చింపుకున్నాడు. వాడి స్టీల్ ఫ్రేమ్‌లోని జయసుధ ఫోటో తీసి లోపల పడేసి, శ్రీశ్రీని అక్కడ కూచోపెట్టాడు.

కాయితాలూ, కలం చేతబుచ్చుకుని టేబిల్ ముందు కూచున్నాడు. స్వగతంలాటి భాగోతం ప్రారంభించాడు.

'యూస్‌లెస్ ఫెలో! బాబిగాడి పరిచయం కలక్కుండా వుంటే ఈ పాటికి ఆరుద్ర, ఆత్రేయ లెవెల్లో వుండేవాణ్ణి! కాలేజీవాళ్లు స్వయంగా గేయం అడిగి రాయించుకునే వాళ్ళు....

ఇవాళ మళ్ళీ మొదటినించీ మొదలెట్టాల్సిందే!

తలరాత తప్పించ ఎవరి తరము?...."

నేను జవాబు యివ్వకుండా బెడ్డెక్కేశాను.

* * *

మర్నాడు....

క్లాసుకి రాలేదు కామేశం. సాయంత్రంవేళ మాట్నీల ఇంటర్వెల్లుందంటూ అటే వెళ్ళిపోయాడు బాబు. నేను రూమ్‌కొచ్చేసరికి....

కిచెన్లోంచి పొగ వస్తున్నట్టు పొగ వస్తోంది గదిలోంచి. భయం, భయంగా గది తలుపు నెట్టాను. గదిలో కామేశం లేడు!

వాడి టేబుల్‌ముందు మాత్రం యెవరో ఒకాయన లాల్చీ, లూజు పైజామా ధరించి కూర్చుని వున్నారు. ఆయన సృష్టించినదే ఈ పొగంతా అనటానికి నిదర్శనంగా ఆయన చుట్టూ సిగరెట్ పీకలు గుట్టలుగాపడున్నాయి. ఆయనముందు అగ్గిపెట్టెలున్నాయి. ఓ పెట్టె ఎడంచేతిలో వుంది. కుడిచేతిలో కలముంది. ఎదరగా యాష్ట్రే వుంది. అందులో సగం కాలిన సిగరెట్టుంది.

నెమ్మదిగా కళ్ళు నులుముకుంటూ అడిగాను—

"మా కామేశం లేడాండీ?"

ఒక్కసారి తలెత్తారాయన. కళ్ళజోడు పైనుంచి నన్ను వీక్షించారు.

"ఒరే, వెధవ్వేషాలెయ్యక లోపలికి తగులడు!" అంటూ అరిచారు.

అదిరిపడ్డాను.

"అరె! నువ్వేనుట్రా? ఏమిటీ వేషం? ఈ

సిగరెట్లేమిటి? ఆ అగ్గిపెట్టెలేమిటి?" కంగారుగా అడిగాను.

"వేషమేముందిరా? లాల్చీ, కళ్ళజోడేగా నువ్వనేది? కళ్ళజోడు పాతదే—గేయాలు మానేశాక పెట్టట్లేదు. ఇసా లాల్చీ అంటావా—మరి కవులకి లాల్చీ వుండొద్దూ?"

"ఏడిసినట్టుంది. మరి ఈ సిగిరెట్లు...."

"గురువుగారి అడుగు జాడల్లో నడవాలని—ఇవాళ్టినుంచే ప్రాక్టీసు ప్రారంభించాను."

"ఎవడా గురువు?"

"నోర్మూయ్. ఎవ'డా?' శ్రీశ్రీ! వారెప్పుడూ ధూమపానం చేస్తుండబట్టే అంతవారయ్యారు! మరి నేనూనూ...."

"తగలడ్డట్టేవుంది! ఆ అగ్గిపెట్టెలెందుకు మరి?"

"అవి నా కవితా వస్తువులు! అగ్గిపుల్లా, కుక్కపిల్లా....అన్నారు గురూగారు! తేలిగ్గా వుంటాయని అగ్గిపుల్లలమీద మొదలెట్టాను. వింటావా?"

"తంతానొరే, నా జోలిగ్గానీ వచ్చావంటే! నీ ఇష్టంవొచ్చినట్టు ఆ మూలే ఏడువ్!"

"బాబిగాడెలాగూ వినడు. పొద్దుణ్ణించీ కాపీలమీద బతుకుతూ రాస్తున్నాను! కాస్త నువ్వయినా వినరా...."

నా అనుమతితో ప్రమేయం లేకుండానే మొదలెట్టాడు కామేశం—

"మండుతూ, మండిస్తూ........
అనాగరికాన్ని ఖండిస్తూ........

(ఇక్కడ సిగిరెట్లు వెలిగించటమే అనాగరికాన్ని ఖండించటం అన్నమాట—అంటూ వివరించాడు—)

పేదల గుండెల ఆకలి మంటల్ని
గుండీలు విప్పి చూపిస్తూ
నెత్తురు కక్కుతూ మండే
ఓ అగ్గిపుల్లలారా!
వెలుగు చూపించరా! జగతిరక్షించరా!"
ఇక్కడ యతి చూశావ్...."

"యతీలేదు-ప్రాసాలేదు. నా మతి పోగొడుతున్నావొరేయ్! నువ్వు మాస్తావా? నన్ను పొమ్మన్నావా?" కంయ్‌మంటూ అరిచేసరికి, నేను సీరియస్ కావటం అరుదేమో, బూచాడిని చూసినవాడిలా జడుసుకుని పూరుకుండి పోయాడు కామేశం.

మర్నాడు కాలేజీక్కూడా కవికుమారుడి ఫోజులోనే వచ్చాడు కామేశం. నోట్సుల్తోపాటు నిన్నరాసిన కాయితాలుకూడా తీసుకొచ్చాడు.

తెలుగు క్లాసు జరుగుతోంది. సంధ్యవేపే చూస్తూ కూర్చున్నాడు కామేశం. 'నలదమయంతి' చెప్తున్న లెక్చరర్ కామేశం ధోరణి గమనించి, సడెన్‌గా—

"కాబట్టి—హంస రాయబారంలో వుద్దేశమేమిటోయ్?" అంటూ వాడినే ప్రశ్నించారు. కామేశం తడుముకోకుండా లేచి నిలబడి,

"తాను కాలుతూ జగతిని వెలిగించటం సార్!" అనేశాడు. సంధ్యతోసహా అందరూ గొల్లున నవ్వారు.

దాంతో నాకు స్థిరంగా తెల్సిపోయింది—కవిత పూర్తికాందే వీడు మామూలు మనిషి కాడని!

క్లాసు కాగానే తెలుగు లెక్చరర్ని ఫాలో అయ్యాడు. నన్నూ తోడు రమ్మన్నాడు. తప్పలేదు నాకు.

తెలుగు లెక్చరర్ని పదినిముషాలు బోరి, పద్యాలు వినిపించాడు. అభిప్రాయం చెప్పమంటూ నిల్చిశాడు! ఏం చెబుతాడాయన? పాపం, ఆవదం తాగిన మొహంతో,

"ఇలాకాదోయ్, కాస్త జీవం వుండాలి కవితలో...." అన్నాడు.

గతంలో వాడి కవితల్ని తిప్పికొట్టిన సంపాదకులు మొదలు ఇవాళ్టి కవితని విమర్శించిన తె. లె.గారి వరకూ రసవిహీన హృదయులందర్నీ ఖండిస్తూ క్లాసుకొచ్చి పడ్డాడు కామేశం.

ఆరోస్పాయంత్రం రూము కెళ్తుంటూనే భయంవేసింది-ఓ క్లాసు ముందే వెళ్ళిపోయిన కామేశం రూములో ఏ ప్రళయం సృష్టిస్తున్నాడో-అని! తీరా రూముకెళ్ళేసరికి,

## (వి)చిత్ర విజ్ఞానం





చింపంజీలు తమ పళ్ళను ఎంతో శుభ్రంగా వుంచుకుంటాయి. టులేన్ యూనివర్సిటీ జంతు శాస్త్రజ్ఞులు, చింపంజీలు పుల్లలతోనూ, వేళ్ళతోను పళ్ళు తోముకోవడం గమనించారు. పెద్ద చింపంజీలు, తమ పిల్లలకు పళ్ళు తోముకోడం నేర్పిస్తాయట. పుప్పి పళ్ళను జాగ్రత్తగా ఊడ పీకేయడం కూడా చేస్తాయట!

---

తాళంకప్ప దర్శనమిచ్చింది!

'అరె! వీడెక్కడి కెళ్ళాడబ్బా? రూంలో వుండి నన్నేకాక, వూరిమీదబడి జనాన్నికూడా చంపుతున్నాడా?' అనుకుంటూ తలుపులు తెరిచాను.

ఆరాత్రి పడుకునేదాకా రూముకి రాలేదు వాడు. ఏ అర్ధరాత్రి వేళొచ్చి ఏం కొంప ముంచుతాడోనని భయపడుతూనే పడుకున్నాను.

'కుయ్యో' మన్న అరుపూ, 'ఛయ్. ఛయ్' మన్న కేకా వింటూనే నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాను. గదంతా చీకటిగా వుంది.

ఏవో రెండు చింతనిప్పులు కదుల్తున్నాయి పక్కనున్న బెడ్ మీద!

ముచ్చెమట్లు పోశాయి. దెయ్యం.... దెయ్యమొచ్చింది గదిలోకి!

"బాబోయ్" గట్టిగా కళ్ళుమూసుకు కేక పెట్టాను.

'టప్'మని లైటు వెలిగింది.

"ఏమిట్రా ఆ కేక?" మెల్లిగా వినబడింది కామేశం గొంతు.

కళ్ళు తెరచాను భయం భయంగా.

ఎదురుగా కనిపించాడు కామేశం. వాడి చేతిలో ఓ గొలుసుంది. ఆ గొలుసుతాలూకు రింగుకి ఓ కుక్కపిల్ల మెడ తగిలించివుంది.

నే చూసిన రెండు నిప్పులూ దాంతాలూ కళ్ళు!

ఒళ్ళు మండిపోయింది!

"ఏమిట్రా ఇదంతా? ఇప్పుడు రావట మేమిటి? ఆ కుక్కపిల్లేమిటి? ఏమిటస లిదంతా?"

బెదురుగా అన్నాడు వాడు,

"ఏం లేదురా! ఊరంతా తిరిగి, బయటి గూడెంలో పట్టుకున్నాను దీన్ని! సాయంత్ర వంతా సముద్రపొద్దున కూచుని దీంతో ప్రాక్టీస్ చేసి కొన్ని గేయాల్రాశా!

ఇహ ఫినిషింగ్ టచప్ ఇచ్చి...."

"ఒరేయ్! దయచేసి దాన్ని తీసుకు బయటి కెక్కడికన్నా పో నాయనా!...."

దానివంక చూసి వణుకుతూ అన్నాను.

"నీకేం ఫర్లేదురా! నువ్ కళ్లు మూసుకు పడుకో. నే చూసుకుంటా దాన్సంగతి!"

ఓరి వీడి ధైర్యం కూల! బాబిగాడు లేక పోవటంతో ఎంతకి తెగించాడు!

తలనిండా ముసుగు బిగించాను. రాత్రంతా 'కుయ్ కుయ్' మన్న కుక్కపిల్ల అరుపుతో నిద్రపట్టనేలేదు.

తెల్లారి లేచేసరికి, కామేశం బాత్రూంలో వున్నాడు. కుక్కపిల్ల వరండాలో కట్టేసి వుంది.

'ఏం పద్యాలార్శాడు దానిమీద?'

చూద్దామనిపించి, వాడి ఫైల్ తెరిచాను—

"అరుస్తా-అరుస్తా-కుయ్ కుయ్ మని
అరుస్తా

ఖండిస్తా-ఖండిస్తా-అన్యాయం ఖండిస్తా!
కరుస్తా-కరుస్తా-దుండగుల్ని కరుస్తా!
రక్తపు చేరులు పారగ విద్రోహుల
కరుస్తా!
రక్తం ప్రవహింపజేసి విప్లవాగ్ని రగిలిస్తా
విప్లవ జ్వాలల వెలుగున దేశాన్నే
వెలిగిస్తా...."

ఇంతలో వచ్చేశాడు వాడు—

"చూస్తున్నావా? చూడు, చూడు. ఎలా గుంది కవిత్వం? బాగా వొచ్చింది కదూ?"

గబుక్కున టవలందుకుని బాత్‌రూమ్‌వైపు పరుగుతీశా, ఇంకో క్షణం వుంటే మిగిల్నవి కూడా చదివి వినిపిస్తాడేమో!

స్నానం చేస్తూవుంటే, ఓ అనుమానం వచ్చింది. 'అగ్గిపుల్లా కుక్కపిల్లా అయ్యాయి కదా-ఇహ వీడు సబ్బుబిళ్ళలమీద పట్టించడు కదా!' వెంటనే ధన్‌మని దాన్ని బాక్స్‌లోవేసి మూసేసి రూమ్‌లోకి పోగానే నా పెట్టెలో పడేశాను.

ఆవేళ వాడు తెలుగు లెక్చరర్ని వెంబడించాడు. ఐతే, నన్ను పిలవలేదు—బతికి పోయాను! ఆయనేమన్నాడో ఏమోగానీ వాడింక క్లాసుకే రాలేదు.

ఆరోజు సాయంత్రం గదికి రాలేదు. పైగా, గోరుచుట్టు మీది రోకటిపోటులా కుక్కపిల్లొ హటీ! గదిముందే కట్టేసుండటంతో, దాని అరుపులికి నా మతిపోతోంది.

ఓ అరగంట ఓర్చుకున్నాను.

"ఏవాఁయ్! కామేస్రావ్!"

ఎవరో ఉరిమారు రూంబయట.

అదిరిపడి బయటికొచ్చాను.

అక్కడో పెద్ద పులి నుంచునుంది. దాని పేరు మా వార్డెన్!

"ఏవిటోయ్, కామేసర్రావ్ లేడూ?" ఆయన గర్జించాడు.

"లె....లె....లేడండి."

"ఈ కుక్కపిల్లేమిటి? ఈ గోలేమిటి? మీ పక్కరూముల్లో వాళ్ళంతా రిపోర్టిచ్చారు. ఒహటే గొడవట రాత్రినించీ?"

"ఏ....ఏ .... ఏంలేదండి! మావాడు.... కుక్కపుల్ల....అగ్గిబిళ్ళ....కవిత్వం...."

"ఇదిగో, నువ్ దాన్ని ముందు బయటొది లేసిరా!"

"అమ్మో" కెవ్ మన్నాను.

"ఏవోఁయ్-తేవటానికి లేని భయం...."

"నే కాదండి. వాడేనండి. రాత్రేనండి. నే పట్టుగోలేక...."

పావుగంట గడిచేక, కామేశ్వర్రావ్ రాగానే దాన్ని విడిపించేస్తానన్న అండర్ స్టాండింగుకొచ్చేక, వో అల్టిమేటం తిసిపించి మరీ కదిలేడాయన!

కామేశాన్ని నమిలి మింగుతూ పడుకున్నాను.

పదిన్నర కావొస్తుండగా ముందసుగా విజిలూ, ఆనక కామేశమూ గదిలో కొచ్చేశాయి.

అరికాలిమంట నెత్తికెక్కింది నాకు.

"ఏమిట్రా బోడిపోజులూ నువ్వూనూ? ఎక్కడ తగలడ్డా వింతసేపు? సాయంత్రం వార్డెనొచ్చి కరిచి వెళ్ళాడు నన్ను....!"

"ఓ.కె. డోంట్ వర్రీ...." అంటూ గబుక్కున బయటికి నడిచి కుక్కపిల్లని బంధించిన గొలుసు వూడదీసి, ఆర్యభట్టులా దూసుకుపోతున్న దాన్ని చూసి నవ్వుతూ లోపలికొచ్చాడు వాడు.

నా మతిపోయింది.

"ఏమిట్రా మాంచి వూపు మీదున్నావ్? నీ కవిత్వం గినా సెలెక్టయిందేమిటి?" కంగారుగా అన్నాను. ఆ మేగజైన్ నాకూ వస్తుంది మరి!!


"అదేం లేదురా! బోడి కవిత్వం అదెలా సెలెక్టవుతుంది? అయినా వెధవ కవిత్వం సెలెక్ట్ కాకపోతేనేం?"

ఇదేమిటి, వీడి ధోరణి ఇలా మారిపోయింది?

"అదేమిట్రా? మరి సంధ్య...."

"ఆఁ నా మొహం! అసలు ఆ గేయం రాసింది సంధ్యకాదు. సి సెక్షన్‌లోని యస్.

నువ్విలా వేషాలకోసం స్టూడియోల వెంట తిరుగుతూ వుంటే.. విడాకు లిచ్చేస్తాను.. జాగర్త మావాఁ!!



దయానిధిట! కలం పేరుగా 'సంధ్య' అని పెట్టుకున్నాట్ట?"

సంధ్య కసలు పత్రికల్చదవటమే ఎలర్జీట! కవిత్వమంటే డోకుట....

ఇవేళ సంధ్యతో మాటాడేనా?!"

"సంధ్యతోనా?" ఆశ్చర్యపోయాను.

"మధ్యాన్నం తెలుగు లెక్చరర్ నా పద్యాల్చూసి, ఇలా నన్ను బోరావంటే మంచి కవిత్వం రాసినా వేసుకోనంతే'' అన్నారు. ఎలాగరా అని చింతిస్తూ, రాజుగాణ్ణి పట్టాను. ఎలాగయినా సంధ్యతో మాట్లాడితే ఆ కిటుకేవన్నా తెలుస్తుందేమో, లంచ్ తర్వాత సంధ్యని కల్సుకున్నాం.

"కవిత్వం ఎలా రాశారో కాస్త చెప్తారా- అని రాజుగాడిచేత అడిగించాను. అప్పుడు బయటపడింది అసలు విషయం! తర్వాత ఫైల్లో చూస్తే-ఆ కవిత్వం రాసినవాడు...."

"సర్సరే! ఇహ బోరకు. ఇంతకూ ఇప్పుడెక్కడినించి?"

"ఫస్ట్ షో....నేనూ సంధ్యా సాయంత్రం ఫస్ట్ షోకి వెళ్ళాం!''

"అ(....అప్పుడే...."

"అఫ్‌కోర్స్! సంధ్య వాళ్ళ, ఫ్రెండ్స్ మూడున్నర టికెట్‌కి వెళ్ళారు! మనం కాస్త ఆర్థిక ఇబ్బందుల్లో వుండటంవల్ల, రాజుగాడితో కలిసి టూ నైంటీకే వెళ్ళాం....! మొత్తం మీద వెళ్ళింది మాత్రం ఒక్క సినిమాకే! త్వరలోనే కలిసి కూడా వెళ్తామనుకో.... ఎందుకంటే ఇంటర్వెల్లో సంధ్య నన్ను చూసి నవ్వింది!"

"ఊఁ....కవితా సాధన వదిలి సంధ్యోపాసన ప్రారంభించా వన్నమాట!''

"అసలు కవితా సాధనే సంధ్యకోసం కదా!"

ఈలవేసుకుంటూ బట్టలు మార్చుకోసాగాడు కామేశం!

'ఏదయితేనేం-ఈ ప్రళయం ఇంతటితో ఆగిందికదా!' అన్న ఆనందంతో కంటినిండా నిద్రపోదామని ముసుగు తన్నాను!